సాక్షి ఖమ్మం

శనివారం । 21 । డిసెంబర్ । 2024



తుది దశకు సీఎం కప్

జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు శనివారం ముగియనున్నాయి. శుక్రవారం నాలుగు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. 8లో



బియ్యం స్థానంలో వరిపొట్టు!

పక్కదారి పట్టించిన బియ్యం స్థానంలో ఓ రేషన్ డీలర్ వరిపొట్టు బస్తాలు సిద్ధం చేయగా అధికారుల తనిఖీల్లో బయటపడింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 18°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగే అవకాశముంది. ఉదయం, సాయంత్రం మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కల్లూరురూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం కల్లూరు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 8–45గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఆయన కల్లూరు చేరుకుంటారు. ఇక్కడి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ గృహానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత మంత్రి స్వగ్రామమైన నారాయణపురం వెళ్లి అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నాక తిరిగి కల్లూరు చేరుకుని హైదరాబాద్ బయలుదేరతారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులో పరిశీలన



చెక్‌పోస్టు వద్ద అధికారులు

బోనకల్: బోనకల్ మండలం చొప్పకట్లపాలెంలో తెలంగాణ – ఏపీ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తహసీల్దార్ పున్నం చందర్, ఎస్‌ఐ మధుబాబు శుక్రవారం పరిశీలించారు. సన్న రకాల ధాన్యానికి తెలంగాణలో క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్న నేపథ్యాన అక్కడి వ్యాపారులు తీసుకొస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యాన అధికారులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆర్‌ఐ లక్ష్మణ్ నాయక్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెమినార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని త్వరలో రాష్ట్రస్థాయి సెమినార్ జరగనుందని డీఈఓ ఈ.సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న సైన్స్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం tgscertseminar@gmail.com వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

నిబద్ధతతో వైద్యసేవలు అందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి సూచించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లతో శుక్రవారం ఆమె పలు అంశాలపై సమీక్షించారు. ఉదయం 9నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూశాకే క్షేత్రస్థాయికి వెళ్లాలని తెలిపారు. ఆస్పత్రిలో మందులను పరీక్షిస్తూ కొరత ఉంటే తెప్పించుకోవాలని, ఆరోగ్య కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అంతేకాక గురుకులాలు, హాస్టళ్లలో పరిశీలిస్తూ విద్యార్థులకు అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, పీఓలు డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ చందునాయక్, డాక్టర్ రామారావు, డాక్టర్ వెంకటరమణ మాట్లాడగా డెమో సాంబశివరెడ్డి, డీపీఓ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఏదులాపురం మున్సిపాలిటీ



నూతన మున్సిపాలిటీ వివరాలు	12 గ్రామపంచాయతీల్లో జనాభా	ఓటర్లు	గృహాలు
	58,647	43,874	18,937

విస్తీర్ణం	ఆస్తి పన్ను డిమాండ్	వ్యవసాయ ఆధారిత కుటుంబాలు	జీపీల్లో వ్యవసాయభూమి
69.771 చ.కి.మీ.	రూ.5,83,44,529	4,849	10,779 ఎకరాలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

- రూరల్ మండలంలోని 12 జీపీలతో ఏర్పాటు
- మంత్రి పొంగులేటి కృషితో జాబితాలో స్థానం
- జిల్లాలో ఐదుకు చేరిన పురపాలికలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటవుతోంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా 12మున్సిపాలిటీలను ఏర్పాటుచేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటతో పాటు ఖమ్మం జిల్లాలో ఏదులాపురానికి జాబితాలో చోటు దక్కింది. పాలేరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రద్ధ వహించడంతో మున్సిపాలిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఖమ్మంరూరల్ మండలంలోని 12గ్రామపంచాయతీలను కలుపుతూ ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

సర్వే.. నివేదిక

పాలేరు నియోజకవర్గంలో కొత్త మున్సిపాలిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై సర్వే చేయాలని ప్రభుత్వం కొన్నాళ్ల క్రితం ఆదేశించింది. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో ఖమ్మంరూరల్ ఎంపీడీఓ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని తేల్చారు. ఇందులో బారుగూడెం, గొల్లగూడెం, గుదిమళ్ల, చిన్న వెంకటగిరి, ఏదులాపురం, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, పెద్దతండా, తెల్దారుపల్లి పూర్తిగా, పోలేపల్లి, పల్లెగూడెంలో కొంత భాగం కలుపుతూ మున్సిపాలిటీ ఏర్పాటుకు నివేదిక సమర్పించగా కలెక్టర్ ద్వారా డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కి పూర్తి వివరాలు అందజేశారు.

అన్ని నియోజకవర్గాల్లో...

గతంలో ప్రతిపాదించినట్లుగానే ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో నాలుగో మున్సిపాలిటీ ఏర్పాటుకానుంది. ఇప్పటికే ఖమ్మం నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉండగా, సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గ కేంద్రాలు మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి. ఇప్పుడు పాలేరు నియోజకవర్గంలో ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటవుతుండడంతో అన్ని నియోజకవర్గాల్లో పురపాలికలు ఉన్నట్లయింది.

అశ్వారావుపేట కూడా...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాదాపు పదేళ్లగా ప్రతిపాదనల్లో ఉన్న అశ్వారావుపేట మున్సిపాలిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు అనుమతి లభించింది. తెలంగాణ ఏర్పడ్డాక కొత్త జిల్లాలు, మండలాలు, మున్సిపాలిటీల ఏర్పాటుకు అప్పటి సర్కార్ నిర్ణయించినా అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రతిపాదనకు మాత్రం మోక్షం లభించలేదు. ప్రభుత్వం మారాక ఇటీవల మరోమారు నూతన మున్సిపాలిటీ ఏర్పాటుపై కదలిక వచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్రంలో 12 మున్సిపాలిటీలు ఏర్పాటుచేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించగా అశ్వారావుపేటకు సైతం స్థానం దక్కింది. భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలు ఉండగా అశ్వారావుపేట ఏర్పాటుతో ఆ సంఖ్య ఐదుకు చేరనుంది. కాగా, అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామపంచాయతీల విలీనంతో కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు కానుంది.

నేడు ఆహారోత్సవం !

- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలు
- తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రతీనెలా మూడు లేదా నాలుగో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఒక్కో నెల ఒక్కో అంశంపై ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం(నేడు) 'మన బడిలో తెలంగాణ ఆహారోత్సవం' పేరిట నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. కాగా, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసే వంటకాలను పది మందితో పంచుకునేలా పాఠశాలకు తీసుకురావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు.



తల్లిదండ్రులకు పంపిన ఆహ్వాన పత్రిక

పౌష్టికాహారంపై అవగాహన

విద్యార్థి దశలో పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయమై శనివారం పాఠశాలల్లో జరిగే సమావేశాల్లో తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు పండ్లు, కూరగాయల్లో ఉండే పోషకాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే, ప్రచార కరపత్రాల ద్వారా వాటి అవసరాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులకు పరిచయం చేస్తారు. అంతేకాక తల్లిదండ్రులు తీసుకొచ్చిన ఆహారం ప్రత్యేకతలు, వాటి తయారీ విధానం, అందులోని పోషక విలువలను వారితోనే చెప్పిస్తారు. ఆపై ప్రశ్న, జవాబుల రూపంలో ఆ విశేషాలను అందరూ పంచుకునే అవకాశం కల్పిస్తారు.

ప్రత్యేక ఆహ్వానాలు

పాఠశాలల్లో శనివారం తెలంగాణ ఆహారోత్సవం పేరిట జరిగే ప్రత్యేక సమావేశాల్లో ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనేలా ఇప్పటికే ఆహ్వానాలు పంపించారు. ఇప్పటివరకు జరిగిన ఏ సమావేశానికి కూడా రాని వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇదేసమయాన తల్లిదండ్రుల ఫోన్లలో విద్యార్థులకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని నమోదు చేయనున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రణాళిక

- రహదారుల వెంట ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని శుక్రవారం రోడ్డు భద్రత అంశంపై పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించడమే కాక ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఆయా ప్రాంతాల హెచ్చరికలు బోర్డులు ఏర్పాటుచేయడమే కాక రహదారి భద్రతపై వాహనదారులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. మితిమీరిన వేగమే చాలా ప్రమాదాలకు కారణమవుతున్నందున యువతకు అవగాహన కల్పించేలా విద్యాసంస్థల్లోనూ సదస్సులు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే, పాఠశాలల ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తొలగించాలని ఆదేశించారు. అంతేకాక జాతీయ రహదారిపై వేగ నియంత్రణ సూచనల బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీస్, ఇతర శాఖల అధికారులు పరిశీలించి నివారణ చర్యలపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వైరా బ్రిడ్జి వద్ద తరచుగా సమస్యలు వస్తున్నందున జాతీయ రహదారుల అధికారులతో చర్చించి తక్కువ సమయాన కొత్త బ్రిడ్జి నిర్మాణానికి అవకాశాలు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్వో రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి వివిధ పార్టీల నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను పరిశీలించి తిరిగి గదులకు సీల్ వేశారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్.స్వామి, డీటీ అన్సారీ, అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

పిల్లలు లేని దంపతులు చట్టప్రకారం అనాథ పిల్లలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న ఇద్దరు పిల్లలను అమెరికా, ఖమ్మంకు చెందిన దంపతులకు శుక్రవారం అప్పగించాక ఆయన మాట్లాడారు. పిల్లల దత్తత విషయంలో చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే అందరికీ ఇబ్బంది ఎదురవుతుందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి కేసర రాంగోపాల్‌రెడ్డి, డీసీపీఓ విష్ణుచందనతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ అవసరం

అదనపు కలెక్టర్ శ్రీజ



మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి: ప్రతీ మహిళ ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండాలని.. ఇందుకోసం స్వయం ఉపాధి రంగాల్లో నైపుణ్యం సాధించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. కారేపల్లిలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువతులు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా బ్యాంకుల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వడ్డీ లేని రుణాలతో స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుచేసుకుంటే కుటుంబాలు, ఆపై సమాజం ఆర్థికంగా బలోపేతమవుతందని తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించే బాధ్యతతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను కూడా మహిళా సంఘాలకు అప్పగించామని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవి, ఐకేపీ ఏపీఎం పి.వెంకటేశ్వర్లు, సీసీలు, మహిళా సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో పారదర్శకత

ఖమ్మం సహకారనగర్: గ్రంథాలయ సంస్థ వద్ద అందుబాటులో ఉన్న నిధులను పారదర్శకంగా వినియోగించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 17జీపీల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లకు రూ.14,09,275 చెల్లించాల్సి ఉండగా నిధులు వెనక్కి మళ్లాయని తెలిపారు. ఈసారి అందుబాటులో ఉన్న రూ.10 లక్షలు చెల్లించాలని చెప్పారు.

అలాగే, గ్రంథాలయాల మరమ్మతుల కోసం రూ.83 లక్షలతో ప్రతిపాదనలు అందగా రూ.50 లక్షలకు అనుమతించామని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి గ్రంథాలయ సెస్ విషయమై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈసమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, వయోజన విద్య ఉపసంచాలకులు జయశంకర్, గ్రంథాలయ కార్యదర్శి వి.అర్జున్, ఉద్యోగులు జె.భాస్కర్, వి.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా బ్యాంకర్లు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 వార్షిక రుణ ప్రణాళికలో సెప్టెంబర్ నాటికి రూ.2,722.66 కోట్ల స్వల్పకాలిక, రూ.1,239.55 టర్మ్ రుణాలు ఇచ్చారన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.1,216.65 కోట్లు, విద్యా రుణాలుగా రూ.17.53 కోట్లు, గృహ రుణాలు రూ.57.09 కోట్లు ఇచ్చారని వెల్లడించారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.5928.38 కోట్లు, అప్రాధాన్యత రంగాలకు రూ.2,265 కోట్ల రుణాలు మంజూరు చేశారని తెలిపారు. ఇక జిల్లాలోని 764 మహిళా సంఘాలకు సైతం రుణాలు ఇవ్వగా రానున్న మూడు నెలల్లో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈసమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, నాబార్డ్ డీపీఎం సుజిత్‌కుమార్, వివిధ బ్యాంకుల అధికారులు సాయితేజరెడ్డి, హన్మంతరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీహరి, ఎస్.వీ.ఆదిత్య, గిరిజన, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు విజయలక్ష్మి, నవీన్‌బాబు పాల్గొన్నారు.

రవాణా శాఖకు ఇన్‌చార్జ్‌లే దిక్కు!

- ఏడు నెలలుగా ఆర్‌టీఓ పోస్టు ఖాళీ
- సీనియర్ ఎంవీఐలకే అదనపు బాధ్యతలు
- రెండు చోట్ల చక్కదిద్దలేక అదనపు భారంతో అవస్థ



ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయం

ఖమ్మంక్రైం: మునుపెన్నడూ లేనివిధంగా కీలకమైన ప్రాంతీయ రవాణా శాఖ అధికారి(ఆర్‌టీఓ) పోస్టును నెలల తరబడి భర్తీ చేయకుండా కాలం గడుపుతున్నారు. దీంతో రవాణా శాఖ పరంగా కార్యకలాపాలు సజావుగా సాగడం లేదని తెలుస్తోంది. ఎంవీఐలకు ఆర్‌టీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తుండడంతో వారు రెండు చోట్ల పనులతో సతమతమవుతున్నారు. రవాణా శాఖ కార్యాలయాలకు నిత్యం ఆర్‌సీలు, ఎల్‌ఎల్‌లు, పర్మనెంట్ లైసెన్సుతో పాటు అంతర్జాతీయ లైసెన్సుల కోసం వందలాది మంది వాహనదారులు వస్తుంటారు. ఈక్రమాన ఇన్‌చార్జ్ అధికారులు ఎక్కడా సక్రమంగా పనిచేయని పరిస్థితుల్లో వాహనదారులకు సేవల్లో జాప్యం జరుగుతోంది.

తొలుత సెలవు.. ఆపై పొడిగింపు

గతంలో ఇక్కడ ఆర్‌టీఓగా విధులు నిర్వర్తించిన ఆఫ్రిన్ జూలై నెలలో వ్యక్తిగత కారణాల రీత్యా నెల పాటు సెలవు పెట్టి వెళ్లారు. ఆతర్వాత ఆమె ఇప్పటి వరకు సెలవు పొడిగించుకుంటూనే ఉన్నారు. మధ్యలో ఆఫ్రిన్‌కు పదోన్నతి కూడా లభించింది. అయితే, ఆమె ఖమ్మంలో పనిచేయడం ఇష్టం లేకే సెలవులో వెళ్లారని ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా ఆమెను బదిలీ చేయకపోగా, మరొకరిని నియమించకుండా సీనియర్ ఎంవీఐలను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నారు. తొలుత ఖమ్మం ఎంవీఐ వెంకటరమణకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా ఒకే కార్యాలయంలో కావడంతో ఎలాగోలా పని కానిచ్చేశారు. కొన్నాళ్ల క్రితం ఆయన కూడా సెలవులో వెళ్లగా వైరా ఎంవీఐ వరప్రసాద్‌ను ఇన్‌చార్జ్ ఆర్‌టీఓగా నియమించారు. ప్రస్తుతం ఆయన అటు వైరా, ఇటు ఖమ్మంలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కీలకమైన రవాణా శాఖ అధికారి పోస్టును నెలలు తరబడి భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులకు భారం పడుతుండగా వాహనదారులు సైతం సమయానికి సేవలందడం లేదని చెబుతున్నారు. ఇన్‌చార్జ్ అధికారులు రెండు కార్యాలయాల్లో పనులు చక్కబెడుతూనే జిల్లా స్థాయి సమావేశాలకు హాజరుకావాల్సి వస్తోంది. దీంతో ఆ సమయంలో కార్యాలయాల్లో విధులకు ఆటంకం ఎదురై సేవలు నిలిచిపోతున్నాయని తెలుస్తోంది.

ఆదాయంపై ప్రభావం.. ఏజెంట్ల ఇష్టారాజ్యం

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కీలక శాఖల్లో రవాణా శాఖ కూడా ఒకటి. కానీ జిల్లాలో పూర్తిస్థాయి అధికారి లేక ఆదాయంపై ప్రభావం పడుతోంది. ఇప్పటికే చెక్‌పోస్టుతో పాటు ఇతర మార్గాల్లో రావాల్సిన ఆదాయం తగ్గుముఖం పట్టినట్లు సమాచారం. మరోపక్క పూర్తిస్థాయి అధికారి లేని కారణంగా కార్యాలయాల్లో ఏజెంట్ల హవా కొనసాగుతోంది. సిబ్బందిని మచ్చిక చేసుకుని ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్న వారు తమ పనులు చేయించుకుని కాసులు దండుకుంన్నట్లు తెలుస్తోంది.

మూడు కార్యాలయాలు, చెక్‌పోస్టు

జిల్లాలో ఖమ్మంతోపాటు వైరా, సత్తుపల్లిలో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఇవి కాక కల్లూరులో చెక్‌పోస్టు సైతం ఉంది. వీటిన్నింటినీ ఆర్‌టీఓ పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం పూర్తిస్థాయి అధికారి లేక ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎంవీఐలు రెండు కార్యాలయాల్లో విధులకే సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో మిగతా కార్యాలయాలు, చెక్‌పోస్టులపై అజమాయిషీ కరువవుతోంది. ప్రధానంగా పర్మిట్ల బదిలీ, రద్దుతో పాటు అంతర్జాతీయ లైసెన్సుల జారీ అధికారం ఆర్‌టీఓకే ఉంటుంది. కానీ పని ఒత్తిడితో పాస్‌పోర్ట్ ఇతర వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి జారీ చేసిన ఇంటర్నేషన్ జారీ విషయంలో నామమాత్రంగానే పరిశీలన కొనసాగుతోందని తెలుస్తోంది.

కొరవడిన సమన్వయం

ఏడు నెలలుగా జిల్లా రవాణా శాఖ అధికారి లేకపోవడం, ఇన్‌చార్జిల పరిపాలన సాగుతుండడంతో జిల్లాలోని అన్ని కార్యాలయాలపై ప్రభావం పడుతోంది. ఖమ్మం, వైరా, సత్తుపల్లిలో అంతా ఒకే కేడర్ అధికారులు కావడంతో ఇన్‌చార్జ్ ఆర్‌టీఓతో సమన్వయం కొరవడుతోందని సమాచారం. సదరు అధికారి చెబుతున్నా కొందరు సిబ్బంది పెడచెవిన పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫలితంగా ఇన్‌చార్జ్‌లు కూడా మార్గనిర్దేశం మాట పక్కన పెట్టేసి తమ విధుల్లో నిమగ్నమవుతున్నట్లు సమాచారం.

హోరాహోరీగా క్రీడాపోటీలు

రెండోరోజుకు చేరిన గురుకులాల రాష్ట్రస్థాయి పోటీలు

పాల్వంచరూరల్: రాష్ట్రస్థాయి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలోని లక్ష్మీదేవిపల్లి గురుకులంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శుక్రవారం పలు జట్లు ఫైనల్స్‌కు చేరాయి. అండర్–17 విభాగం వాలీబాల్ పోటీల్లో జోన్–2, జోన్–7 జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. అండర్–19 విభాగం కబడ్డీ పోటీల్లో జోన్–7, జోన్–4 జట్లు, అండర్–17 విభాగం ఖోఖో పోటీల్లో జోన్–1, జోన్–4 జట్లు, అండర్ 19 విభాగంలో జోన్–1, జోన్–3 జట్లు, హ్యాండ్‌బాల్ పోటీల్లో జోన్–1, జోన్–5 జట్లు, అండర్–19 విభాగంలో జోన్–4, జోన్–6 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్‌లో జోన్–1, జోన్–5 జట్లు, టెన్నికాయిట్‌లో జోన్–4, జోన్–3 జట్లు ఫైనల్స్‌కు చేరాయని నిర్వాహకులు వెల్లడించచారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

విజేతలు వీరే..

క్యారమ్స్ పోటీల్లో జోన్–2 జట్టు ప్రథమ, టెన్నికాయిట్‌లో జోన్–3, 4 ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్–14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఎ.విశాల్ ప్రథమ, ఎం.నితిన్ ద్వితీయ, పి.రాకేష్ తృతీయ, లాంగ్‌జంప్ పోటీల్లో సీహెచ్.నితిన్ ప్రథమ, టి.చరణ్ ద్వితీయ, ఎం ప్రవీణ్ తృతీయ, షాట్‌పుట్‌లో శివరాజ్ ప్రథమ, కె.ఆనంద్ ద్వితీయ, కె.సంకేత్ తృతీయ స్థానాలు సాధించారు.

అండర్–17 విభాగంలో

లాంగ్ జంప్‌లో కె.ప్రవీణ్ ప్రథమ, కె.ఆనంద్ ద్వితీయ, జి.అనిల్ తృతీయ, 5 వేల మీటర్ల పరుగు పందెంలో ఎ.భద్రూనాయక్ ప్రథమ, జె.గౌతమ్ ద్వితీయ, వి.బన్ని తృతీయ స్థానాల్లో నిలిచారు.

అండర్–19 విభాగంలో

షాట్‌పుట్‌లో పి.అరవింద్, సిద్ధార్థ, ఎ.గణేష్, లాంగ్ జంప్ లో ఎ.గణేష్, కె.ఉదయ్‌కిరణ్, డి.గణేష్, 5వేల మీటర్ల పరుగు పందెంలో జి.శివకుమార్, పి.గోపిచంద్, సి.సునీల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఆయాపోటీల్లో విజేతలకు గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, మల్టీజోనల్ అధికారి అలివేలు, స్పోర్ట్స్ మీట్ ఇన్‌చార్జి సట్ల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

పోలీసు కమిషనరేట్ ఏఓగా చంద్రకళ


సీపీ సునీల్‌దత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఓ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయం ఏఓ(అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్)గా బి.చంద్రకళ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ కమిషనరేట్ సెక్షన్ సూపరిండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఏఓగా పదోన్నతిపై ఖమ్మంకు కేటాయించారు. ఈమేరకు శుక్రవారం విధుల్లో చేరిన సీపీ సునీల్‌దత్‌తో పాటు అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

54మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు


చెక్కులు అందుకున్న వారితో నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న పలువురికి రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేసింది. ఈమేరకు 54 మందికి రూ.13.81లక్షల విలువైన చెక్కులు మంజూరు కాగా, ఖమ్మంలోని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, స్వర్ణ నరేందర్, కోసూరి శ్రీను, గురవయ్య, రాధాకృష్ణ, చల్లా రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన సీతారాములు, రాయల పుల్లయ్య , ఇమ్మడి తిరుపతిరావు, మద్దిని చంద్రశేఖర్, రాధాకృష్ణ, తొగర శ్రీను పాల్గొన్నారు. పాల్గొన్నారు.

'హార్డ్‌కాపీలు అవసరం లేదు'

ఖమ్మంమయూరిసెంటర్: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళాశక్తి పథకంలో ఉచిత కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ మహిళలు హార్డ్ కాపీలు సమర్పించాల్సిన అవసరం లేదని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈవిషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కటికల క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. జిల్లా బాలుర జట్టులో ఎస్.జగదీష్, బి.కౌశిక్, ఎస్.అజయ్, వి.రోహిత్‌కుమార్, బి.హితేష్, జి.నాగరాజు, జి.రాజేష్, కె.వికాస్, జి.రాకేష్, బి.శ్రీనివాస్, జి.గోపి, బి.నవీన్‌కుమార్‌తో పాటు కె.శివకష్ణ, బి.సుధీర్‌కుమార్, వి.శివ, టి.విష్ణు ఎంపికయ్యారని వెల్లడించారు. అలాగే, బాలికల జట్టుకు టి.కావేరి, ఎస్.కే.అమీనాబేగం, వై.నిఖిత, బి.హనీ, నాగమణి, డి.స్పందన డి.హారిక, జి.కావ్యశ్రీ, బిందు, విద్యాశ్రీచందన, ఈ.నవిత, జి.శ్రీతేజతో పాటు బి.భావన, టి.మేఘన, బి.ప్రిన్సీ, బి.కృష్ణవేణిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా బోధన సిబ్బంది నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కోర్సుల్లో సాధించిన మార్కులు, డెమో ఆధారంగా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. కెమిస్ట్రీ బోధనకు ఆరుగురు, ఫిజిక్స్ ఒకరితో పాటు నలుగురు స్టూడెంట్ కౌన్సిలర్లను నియమించనున్నట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి బీఈడీ పూర్తిచేయడమే కాక సీటీఈటీ, టెట్ పాసై ఉండాలని వెల్లడించారు. స్టూడెంట్ కౌన్సిలర్ పోస్టులకు సైకాలజీలో పీజీ లేదా గుర్తింపు ఉన్న యూనివర్సిటీ నుంచి గైడెన్స్, కౌన్సెలింగ్‌లో డిప్లొమా చేసి జాతీయస్థాయిలో ఏడాది అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని, వివరాల కోసం పనిదినాల్లో 80743 35630 నంబర్ ద్వారా సంప్రదించాలని పీఓ సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,300	6,300
మిర్చి	16,569	5,000
మిర్చి తాలు	7,300	6,000
ఏసీ మిర్చి	16,700	6,500
ఏసీ తాలు	7,400	7,200
పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,413


సింగారెడ్డిపాలెం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పిల్లల భవిష్యత్ కోసం సమష్టి కృషి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నేలకొండపల్లి: పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ఉపాధ్యాయుల కృషికి తల్లిదండ్రులు కూడా చేయూత నివ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మండల కేంద్రంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పిల్లలను క్రమంగా తప్పకుండా పాఠశాలలకు పంపించడమే కాక తరచుగా తల్లిదండ్రులు కూడా వచ్చి వారి ప్రగతిని తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధనకు తోడు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందుతున్నాయని తెలిపారు. ఈమేరకు ఉపాధ్యాయులతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహిస్తే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, పింఛన్, రుణమాఫీ, ఇళ్ల స్థలాల సమస్యలపై పలువురు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ మాణిక్‌రావు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంఈఓ చలపతిరావు, ఏఓ ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి

ఖమ్మంరూరల్: అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను మరింత పెంపొందించుకుంటే స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి అండగా నిలవొచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. రూరల్ మండలం కరుణగిరిలో మున్నేటి ముంపు ప్రాంత బాధితుల కోసం ఆర్‌సీఎం బిషప్ సగిలి ప్రకాష్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కాగా, వరదల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అనంతరం మదర్ థెరిస్సా ఓల్డ్ ఏజ్‌హోంను కలెక్టర్ సందర్శించారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఫాదర్ తప్పెట శౌరి, మాథ్యూ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కరుణగిరిలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీ రెడ్‌కో) ఆధ్వర్యాన ఈనెల 14 నుంచి ప్రారంభమైన ఇంధన పొదుపు వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో ఇంధన పొదుపుపై ప్రచారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించడమే కాక ర్యాలీలు ఏర్పాటుచేశారు. చివరిరోజైన శుక్రవారం పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించగా సంస్థ జిల్లా మేనేజర్ జి.మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఇంధన పొదుపు ఆవశ్యకతను అందరూ గుర్తించి పెట్రోల్, డీజిల్, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఇదేసమయాన తరగని ఇంధన వనరు అయిన సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీజీ రెడ్‌కో ఉద్యోగి ఎండీ.జహీద్ అలీ, రవాణా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఖమ్మం ఆర్‌టీఓ కార్యాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

రేపు అఖిలపక్షం ఆధ్వర్యాన నిరసనలు

ఖమ్మంమయూరిసెంటర్: అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయడమేకాక పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో ఆయా పార్టీల నాయకులు నున్నా నాగేశ్వరరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, సీ.వై.పుల్లయ్య, ఎం.డీ.హుస్సేన్ మాట్లాడారు. హోం మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేసేలా ప్రధాని ఆదేశించాలన్నారు. ఈ అంశంపై అఖిలపక్షం ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా 22వ తేదీన నిరసనలు చేపట్టనుండగా నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, శింగు నర్సింహారావు, మేకల శ్రీనివాసరావు, ఆవుల అశోక్, వై.విక్రం, యర్రా శ్రీనివాసరావు, ఎస్.నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

వైఎస్.జగన్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు ఖమ్మంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఖమ్మం 28వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులతో పాటు కళ్లెం ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యాన ఈ ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. 'నా జగన్ అన్నకు జన్మదిన శుభాకాంక్షలు' శీర్షికతో వీటిని ఏర్పాటుచేయగా శనివారం జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉపేందర్‌రెడ్డితో పాటు జయరాం, బొశెట్టి నాగేశ్వరరావు, కొండ్రు చైతన్యకుమార్, ఉదయ్, వినయ్, గంగరబోయిన రవి, వీర్ల రమణ తదితరులు వెల్లడించారు.


ఖమ్మంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

బియ్యం స్థానంలో వరిపొట్టు !

రేషన్‌షాపులో 33 క్వింటాళ్ల బియ్యం పక్కదారి

తల్లాడ: రేషన్ డీలర్లు పేదలకు ఇవ్వాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూర్చే ఘటన ఇది. బియ్యం స్థానంలో వరి పొట్టు బస్తాలను పెట్టి అంతా సవ్యంగానే ఉందని నమ్మించాలని చూసిన ఓ డీలర్ పన్నాగం బయటపడింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలం పాత మిట్టపల్లిలో మోతుకూరి వేదమహేశ్వరి డీలర్‌గా కొనసాగుతున్న ఐదో నంబర్ రేషన్‌షాపు షాపులో 58 క్వింటాళ్ల బియ్యం స్టాక్ ఉండాలి. కానీ 25 క్వింటాళ్లే ఉండగా, ఇంకొన్ని అక్రమాలు కూడా జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో తల్లాడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజా మొయినుద్దీన్ శుక్రవారం తనిఖీ చేయగా మోసం బయట పడింది. షాపులో 33 క్వింటాళ్ల బియ్యం స్టాక్ లేవని తేల్చిన ఆయన అందుకు బదులు 58 గన్నీ సంచుల్లో వరి పొట్టు నింపి పక్కన పేర్చినట్లు గుర్తించారు. ఈమేరకు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ తెలిపారు.


బియ్యం బస్తాల్లో నింపిన వరిపొట్టును పరిశీలిస్తున్న ఆర్ఐ

హత్య కేసులో 15 మందికి జైలు

కొత్తగూడెంఅర్బన్: హత్య కేసులో 15మందికి జైలు శిక్ష విధిస్తూ భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. 2014 సెప్టెంబర్ 8న గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఇల్లెందు 24 ఏరియాకు చెందిన పులిపాటి లోకేశ్ తనకు చెల్లె అయ్యే యువతిని అవినాష్ ప్రేమిస్తున్నాడని వార్నింగ్ ఇచ్చేందుకు షేక్ ఆరిఫ్, నీలమర్రి నాగరాజు, దేవరపల్లి జితేందర్‌రెడ్డి, ఏలుగు సమంత్, తాళ్లపల్లి వంశీ, బండి శ్రీకాంత్, కరకుపల్లి ప్రేమ్‌కుమార్, ఎట్టి వెంకటేశ్వర్లు, దడిగల నరేశ్, ఎడారి సంపత్, చింతల చెరువు రఘు, కుండోజు రాజు, బోశాల ఉదయ్‌కుమార్, సూరపాక గౌతమ్‌ను పిలిపించాడు. వీరంతా అవినాష్‌తో యువతికి జోలికిరానని ప్రమాణం చేయించారు. అదే సమయాన వారి మధ్య తగాదా జరగగా దాడులు చేసుకున్నారు. దీంతో దండు శ్రీను తదితరులు చేరుకుని అందరినీ పంపించారు. ఈమేరకు నాగరాజు, సమంత్ ఇచ్చిన సమాచారంతో వారంతా ఆయుధాలతో వచ్చి శ్రీను సహా ఐదుగురిపై దాడి చేయగా అప్పటి ఎస్సై బి.అశోక్ కేసు నమోదు చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీను చికిత్స పొందుతూ 2017లో మృతి చెందగా ఆనాటి సీఐలు ఎన్.రమేశ్, ఏ.నరేందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణలో 15 మందిపై నేరం రుజువు కావడంతో ఆరిఫ్, నాగరాజు, దేవరపల్లి జితేందర్‌రెడ్డి, ఎలుగు సమంత్, పులిపాటి లోకేశ్, తాళ్లపల్లి వంశీ, బండి శ్రీకాంత్, కాకరపల్లి ప్రేమ్‌కుమార్, ఎట్టి వెంకటేశ్వర్లు, దడిగల నరేశ్, ఎడారి సంపత్, చింతలచెరువు రఘు, కుండోజు రాజు, బోశాల ఉదయ్‌కుమార్, సూరపాక గౌతమ్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ లక్ష్మి వాదించగా ఎస్సై ప్రవీణ్‌తో పాటు ఎస్.వీరబాబు, శ్రీనివాస్ తదితరులు విచారణకు సహకరించారు.

జాబ్‌మేళాకు 86 మంది హాజరు

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఖమ్మం మోడల్ కెరీర్‌సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో మొత్తం 86 మంది హాజరుకాగా 17మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ముత్తూట్ మైక్రోఫైనాన్స్‌లో ఉద్యోగాలకు 52మంది హాజరుకాగా 16 మందిని, హెటిరో ల్యాబ్స్‌లో ఉద్యోగాల కోసం 11మందిని ఇంటర్వ్యూ చేయగా ఒక్కరే ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి, ఆయా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు ఉపసంహరించుకోవాలి

మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, చంద్రావతి, కొండబాల

ఖమ్మంవన్‌టౌన్: ఈ-ఫార్ములా కార్ రేస్ ద్వారా హైదరాబాద్ ప్రతిష్టను మాజీ మంత్రి కేటీఆర్ మరింతగా పెంచారని మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అక్రమాలు జరిగాయంటూ కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ రాజకీయ కుట్ర కోణంలో కేటీఆర్‌పై కేసు పెట్టి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏడాది పాలనలో హామీలు అమలుచేయలేని పాలకులు ప్రజల దృష్టికి మరల్చేందుకు ఇలాంటి కుట్రలు పన్నారని విమర్శించారు. ఇకనైనా కేటీఆర్‌పై నమోదు చేసిన కేసు ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రాంమ్మూర్తి, గుండాల కృష్ణ, తాజుద్దీన్, బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతో అవస్థలు

సత్తుపల్లి: పేదింటి ఆడబిడ్డల పెళ్లి సమయాన అండగా నిలిచేలా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలువురికి నెలల క్రితం మంజూరైన చెక్కులను గడువు తీరాక ఇవ్వగా లబ్ధిదారులు నష్టపోయే పరిస్థితి ఎదురైందన్నారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, కూసంపూడి రామారావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మల్లూరు అంకమరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

తుదిదశకు సీఎం కప్ క్రీడాపోటీలు


సైక్లింగ్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


హ్యాండ్‌బాల్‌లో విజేతగా నిలిచిన ఖమ్మం అర్బన్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ముగింపు దశకు చేరాయి. ఈమేరకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నాలుగు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈమేరకు పురుషుల హ్యాండ్‌బాల్, మహిళల ఖో-ఖో, సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 448 క్రీడాకారులు హాజరయ్యారు. మహిళల ఖో-ఖోలో ఖమ్మం కార్పొరేషన్, మధిర, పురుషుల హ్యాండ్‌బాల్‌లో ఖమ్మం అర్బన్, దమ్మపేట జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. అలాగే, సైక్లింగ్ బాలురలో వీ.ఎం.సత్యనారాయణ, ఎం.యువన్, జి.సాయికృష్ణ, ఆర్.అరవింద్, ఎస్.కే.అమిల్‌హాసన్ విజయం సాధించగా సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. ఈకార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నర్సింహామూర్తి, అసోసియేషన్ల బాధ్యులు ఆదర్శ్‌కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, పోటీలు శనివారం ముగియనున్నాయని డీవైఎస్ఓ వెల్లడించారు.

అందాల పోటీల్లో రన్నరప్‌గా జిల్లా యువతి

పెనుబల్లి: పెనుబల్లి మండలం వీఎం బంజర్‌కు చెందిన రిటైర్డు సీఐ జెన్నారెడ్డి నరసింహారెడ్డి కుమార్తె రజినీరెడ్డి అందాల పోటీలో రన్నరప్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో నివాసముంటోంది. రాజస్తాన్‌లో నిర్వహించిన అందాల పోటీలో 140 మంది పాల్గొనగా రజినీరెడ్డి న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుని రన్నరప్‌గా నిలిచింది.


రజినీరెడ్డి

'తాళ్లపెంట' ద్వారా నీటి విడుదల

పెనుబల్లి: మండలంలోని తాళ్లపెంట ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి అవసరాలకు సాగర్ జలాలను శుక్రవారం విడుదల చేశారు. కల్లూరు మార్కెట్ చైర్మన్ బాగం నీరజా ప్రభాకర్ చౌదరితో కలిసి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ నీటిని విడుదల చేసి మాట్లాడారు. రైతుల క్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇబ్బందులన్నీ అధిగమించి రైతుల కోసం నీరు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఎత్తిపోతల పథకం మోటార్లు ఆన్ చేస్తున్న దృశ్యం

గ్రామదీపికపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై కేసు


తల్లాడ: మండలంలోని కొడవటిమెట్ట గ్రామదీపికగా పనిచేసిన వరపర్ల దుర్గను తనను తొలగించడంతో ఇదేమిటని ప్రశ్నించగా ఆమెపై దౌర్జన్యం చేసిన ఏపీఎం, ఇద్దరు సీసీలపై కేసు నమోదైంది. కొడవటిమెట్టకు చెందిన దుర్గ స్థానిక సమాఖ్యకు గ్రామదీపికగా పని చేస్తుండగా సభ్యుల నుంచి రుణరికవరీ సరిగా లేదని ఆమెను తొలగించారు. దీంతో నెల క్రితం ఆమె తల్లాడ ఐకేపీ కార్యాలయానికి వెళ్లి ఈ విషయమై అడగగా కార్యాలయానికి ఎందుకు వచ్చావంటూ ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు, సీసీలు కె.నరసింహారావు, ఎస్.సుందర్‌రావు దూషిస్తూ బయటకు నెట్టేశారు. దీంతో దుర్గ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. 8మందికి గాయాలు

చింతకాని: మండలంలోని నాగులవంచలో శుక్రవారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన వృద్ధురాలు తోటకూరి శాంతమ్మ ఉదయం రామాలయానికి వెళ్తుండగా పిచ్చికుక్క వెనక నుండి వచ్చి కరిచింది. దీంతో ఆమె కుడికాలు మడమ వద్ద తీవ్ర గాయం కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత రామాలయం సమీపంలోని ఎస్సీ కాలనీకి చెందిన వడ్లాణపు రజిని, మేకల నాగమ్మ, దేశబోయిన వీరలక్ష్మి, బొడ్డుపల్లి సుజాత, సుతారి మేస్త్రీ అమర బోయిన పుల్లారావుతో పాటు మరో ఇద్దరు చిన్నారులను కూడా కుక్క కరవడంతో స్థానికులు దాన్ని వెంబడించి చంపేశారు. కాగా, కుక్కకాటుకు బాధితులు చింతకాని, ఖమ్మం ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు.

బొలెరో ఢీకొని మహిళ మృతి

కారేపల్లి: పత్తి లోడ్‌తో వెళ్తూ ఆగిన వాహనాన్ని ఒక్కసారిగా వెనక్కి తీయడంతో జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు... కారేపల్లి మధురానగర్‌కు చెందిన గుగులోత్ లక్ష్మి (60) తన భర్తతో కలిసి పెన్షన్ డబ్బు తీసుకునేందుకు సెంటర్‌కు వచ్చారు. ఆసమయాన పత్తి లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనాన్ని డ్రైవర్ ఒక్కసారిగా వెనకకు వేగంగా తీసుకురావడంతో అక్కడే ఉన్న లక్ష్మికి తాకగా టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై లక్ష్మి భర్త దేశ్యా ఫిర్యాదు మేరకు వాహనం డ్రైవర్ వాంకుడోత్ సాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజారాం

వరుసగా ఢీకొన్న వాహనాలు

కొణిజర్ల: రహదారిపై వాహనాలు వరుసగా పరస్పరం ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయిన ఘటన కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నుంచి సత్తుపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఆపై కారు ముందున్న కారును, అది ముందు ఉన్న ఇంకో కారును ఇలా వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోయినా వాహనాలు దెబ్బతిని రహదారిపై నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొణిజర్ల పోలీసులు చేరుకుని వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 12 మంది నుంచి రూ.70,900 నగదు స్వాధీనం చేసుకుని వారిని వైరా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వైరా ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.